

# ఈ దీపావళి తేదీ

అవసరాల రామకృష్ణరావు

పందిరి క్రింద పెళ్ళిబ్యాండు బ్రహ్మాండంగా మోగుతోంది. ప్రక్కనున్న పందిరి మీది సన్నజాజి వయ్యారంగా ఊగుతోంది. పందిరి మధ్యనున్న పెట్రమాక్సు లైటు ఉల్లాసంగా జోగుతోంది.

పెళ్లిళ్లు చేసుకునే పిన్నలందరికీ నా ఆశీర్వాదం, పెళ్ళిళ్ళు కుదిర్చే పేరయ్యలకు నా అభినందనం, పెళ్ళిళ్ళ తంతు కనిపెట్టిన పెద్దమనిషికి నా నమస్కారం. ఫెళ్ళున జరిగే పెళ్ళంటే మాత్రం నాకు చెప్పలేనంత భయం! మరీ దగ్గరవాళ్ళని ముక్కుకి తాడేసి మా ఆవిడ లాక్కురాగలిగింది గాని, పెళ్ళి

పందిట్లో రాటకివేసి కట్టెయ్యగలిగిందా? 'ఆరు నెల్లె తపస్సుచేస్తున్న వాడిలాగ ఏమిటి ఆరూపం? డబుల్ టైఫాయిడు పడి అప్పుడే లేచిన వాడిలాగ అదేమిటి ఆ ఆకారం?' అని మాటల్తో మోచేతి పోటుల్తో నా వేషాన్ని విమర్శించడానికి మా ఆవిడ నా కూడా లేక పోలేదుగాని నేనే ఆ వేళకి అక్కడ లేను. ఎవరికీ కనపడకుండా, దేనికీ వినపడకుండా మేడమీద మారుమూలకి పారిపోయి ఓ మూల కూచుని పేపరు తిరగేస్తున్నాను.

'మా బీరువాలో ఎన్నినగలూ, మా పెట్లో ఎన్ని చీరలూ ఉన్నాయో చూడండ్రో' అని అరగంట కో వేషం మార్చి పనున్నా లేక పోయినా అదేపనిగా అటూ ఇటూ తిరిగే ఆడంగులూ, 'ఎడం చేత్తో, ఇలా ఈ తల వెంట్రుక లన్ని పెళ్ళిళ్ళు చేయించి పారే శాను, ఇలావచ్చి వినండ్రో' అని అహంకారం వెదజల్లే అమ్మమ్మలూ, 'అరటిపళ్ళూ హారతికర్పూరపు పుల్లలూ, జేబురుమాళ్ళూ ఇలా విసరరేమండ్రో' అని అర్రులుచాచే అల్పప్రాయాలూ, 'చందనం బొమ్మ ఉయ్యాల్లో వసంతాన్ని పాడుచెయ్యడం,' 'రోకళ్ళను పాలలో ముంచి బుగ్గలు పొడవడం', 'బిందెలో ఉంగరాలు పడేసి ప్రేక్షకులు చచ్చేలా వధూవరులు రక్కుకోవడం' 'పాంకోళ్లూ, తాటేకుగొడుగూ వేసుకుని కాశీకి వరుడు దయచెయ్యడం' ఇలాంటివి చూడడానికే జన్మఎత్తి ఇలాంటివే పుస్తిముడుపుకంటె ముఖ్యంగా భావించే పులకిత మనస్కులూ, ఇలాంటి అల్పసంతోషులకు పెళ్ళంటే బూరిముక్కతో సమానం ఏమోగాని – జరిగే ఆడంబరంలోని లోటంతా నాదే ఐనట్టూ, పెళ్ళికి పెట్టిన ఖర్చంతా నాదే ఐనట్టూ భావించే నాలాంటివాళ్ళు చూస్తూ చూస్తూ ఏ పెళ్ళికీ హాజరుకాలేరు, ఖర్మం జాలక అయినా అక్కడ ఉండనూలేరు!

మేడ మీదకు చేరుకున్నానన్న మాటేగాని మైకులో మంత్రాలూ, లౌడు స్పీకరులో రికార్డులూ చేసే పోటీ వినిపిస్తూనే ఉంది. ఆ మేడకు యిటుపక్క వరండాలో నాలాంటి వాళ్ళే మరిద్దరు పారిపోయివచ్చి ఏదో దీర్ఘమయిన సంభాషణలోనే పాల్గొన్నట్టున్నారు. మొదట నాకంతగా బోధపడక పోయినా నాకు ఆనేకవిధాల కావలసిన ఒక వ్యక్తిపేరు అందులో దొర్లడంచూసి క్రమంగా అటువైపు ఆకర్షించబడ్డాను. నే నా చుట్టుప్రక్కలే ఉన్నా ననే సంగతి వాళ్ళు గుర్తించక పోవడం వల్ల నే నా సంభాషణ పూర్తిగా వినగలిగేను.

'కళ్ళనీళ్ళు గబుక్కుని తుడిచేసుకుని – ఆ గదిలోంచి యివతలకి వచ్చి-మేడమీంచి గబగబా దిగి క్రిందికి వెళ్ళిపోయిందే, ఆ అమ్మాయి పేరే శ్యామల. ఆ గదిలో ఉన్న పెద్దఫొటో ఇందిరమ్మది. ఈ శుభ సమయంలో యీ అమ్మాయి ఆ ఫోటోకి దండం పెట్టి కళ్ళనీళ్ళు పెట్టుకోవడం కిటికీ సందులోంచి మనంస్పష్టగా చూశాం ఎందుకో చెప్ప గలవా?'

శ్యామల పేరు వినగానే నా మనసు అభిమానంతోనూ, గౌరవభావంతోనూ పులకించింది. నే నా ఊళ్ళో మేష్టరీ వెలిగించిన ఐదారేళ్ళలోనూ కొన్ని వందలమంది చెల్లెళ్ళకు పాఠాలు చెప్పేను. కాని నేను దూరమైనా నాకు దూరం కానివారూ, వారు దూరమైనా నాకు దగ్గిర అయినవారూ కొద్దిమందే ఉన్నారు. అందులో ముఖ్యురాలు శ్యామల. ఏపని చెప్పినా కాదనక చేసే వందలాది శిష్యకోటి ఉండడమే రీడరు మొదలు టీచరువరకు ఉపాధ్యాయవృత్తిలో నున్న ప్రత్యేకసుగుణం. అందులో బుద్ధిమంతులూ, అందమైన అక్షరాలు వ్రాయగలవారూ, తప్పులు లేకుండా తెలిసిన భాషలు వ్రాయ గలవారూ ఉంటే ఆ టీచరు అదృష్టమే అదృష్టం. అటెండెన్సు రిజష్టరులో పేర్లు రాయడం మొదలు టీచింగునోట్సు వరకు నా పనులన్నీ శ్యామలే చేసిపెట్టేది. ఎప్పుడూ ఆ అమ్మాయిది ముందు బెంచీలో మొదటి సీటు. చదువు సంధ్యల్లో కాక ఆట పాటల్లో కూడా ఆ అమ్మాయిది ఎప్పుడూ మొదటి వరసలో ముందుసీటు. లోపల దీపం ఉన్నంత కాలం ఆ చైతన్యరూపం నేను మరచి పోలేనిది. ఆ ముందురాత్రి మా సంభాషణ నేను తుడిచెయ్యలేనిది.

'ఏం, ఆ అమ్మాయి ఎందుకు కళ్ళనీళ్ళు పెట్టుకున్నట్టు?'

'శ్యామల తల్లి ఫొటోకి నమస్కరించి బహుశా ఇలా అనుకొని ఉంటుంది. 'ఇలా ఏపది పదిహేను పెళ్ళిళ్ళకో యీ పాటికి యిక్కడికి వచ్చి ఉంటాను. ఇలా వీరి పెళ్ళి వారిపెళ్ళి చూసి ఆనందించడానికే నాకుజన్మ యిచ్చావా అమ్మా? పెళ్ళికూతురివి కమ్మని నన్నింక దీవించనే దీవించవా అమ్మా? నాకు ఇరవై అయిదు నిండేయి, ఇక ఈ పాపిష్టి హస్తంలో కళ్యాణరేఖ లేనే లేదా, అమ్మా?'

'అదేం? శ్యామలకు పట్టు పట్టి పెళ్ళి చేసే బంధువు లెవరూ లేరా?'

'లేకేం, శ్యామలకి నలుగురు పినతల్లులూ, ఆయిదుగురు మేనమామలూ ఉన్నారు. తోడబుట్టిన ఇద్దరు అన్నలూ, ఒక అక్కా కూడా ఉన్నారు. కాని పదిమందిలో పుట్టినా దిక్కు లేని దయిపోయింది శ్యామల... చెబుతా, విను...

'తండ్రి తరువాత పెద్ద కొడుకు సంసార బాధ్యత వహించా లనే పూర్వకాలపు సాంప్రదాయం గలది ఒకనాటి వెంకట్రామయ్యగారి సమిష్టికుటుంబం. పాడీ పంటా యివి రెండే ఆయన జీవితాదర్శం, ఆయన నమ్మిన మాలక్ష్మిలాగే ఆయన నమ్ముకొన్న గోమాలక్ష్మిలాగే ఆయన జీవితం చివరివరకు కళకళ లాడుతూ వెళ్ళిపోడానికి ఆయన పెద్దకొడుకు కాదుగాని పెద్దకూతురు ఇందిరమ్మ చాలా సహాయం చేసింది. ఆఖరి తమ్ముణ్ణి కని అమ్మ పురిట్లో పోయినప్పుడు పదిమంది సంతానంలోనూ ఇందిరమ్మకే – తన చంటిపాపతోపాటు ముసలాయన్ని కూడా అప్పజెప్పి నిశ్చింతగా కళ్లుమూసింది. భరించలేని భారమైనా, ఒక్కర్తే ఆడదైనా ఇందిరమ్మ అంత బాధ్యతనూ చిరునవ్వుతో స్వీకరించింది. చాకిరీ చేసేటప్పుడు తన కొక శరీరం ఉందనే విషయమూ, సేవ చేసే

టప్పుడు తనకొాక కుటుంబం ఉందనే విషయమూ మరచి, తండ్రి గృహపాలనా కర్తవ్య నిర్వహణలో ఆత్మాంకితం చేసుకుంది ఇందిరమ్మ; సుళువుగా తేలికగా బ్రతకడానికి నిరంతరం దారులు వెతికే అనేక మందితోపాటు ఆమె తమ్ముళ్లుగాని చెల్లెళ్ళుగాని ఆమెకా విషయం జ్ఞాపకం చెయ్యడానికి ప్రయత్నించలేదు. అన్నిటికంటె చిత్రమైన విషయం ఆమెను కట్టుకున్నవాడే 'మన సంసారం వేరు, ఇలా ఎన్నాళ్లు సాగుతుంది?' అని ఒక్కనాడూ ఆలోచించకపోవడం. నోటిని కారాకిళ్లీ ఇరవైనాలుగు గంటలూ ఉండటానికి ఏర్పాట్లు జరిగినంత కాలం, పేకాటప్రియులు ప్రపంచంలో ఉన్నంతకాలం సీతయ్యకు పక్కని పిడుగు పడినా చలనం ఉండదు. ఆయనకు ఇద్దరు కొడుకులూ ఇద్దరు కూతుళ్ళూ పుట్టడం, కొడుకులకీ పెద్దకూతురుకీ పెళ్ళైపోవడం ఇవన్నీ ఆయన 'ప్రెజెంటు కంటిన్యూఅస్ టెన్స్'లోనే – అనగా కిళ్లీ నవుల్తూ పేకాడుతుండగానే జరిగిపోయాయి. ఆయనకి పళ్లురావడం, పళ్ళు ఊడడంకూడా అక్కడే జరిగి పోయాయి!

ఎవరికి ఏ ఉత్తరాలు ఏ విధంగా రాయాలో జ్ఞాపకం చెయ్యడంతోపాటు... బాకీలూ జమలూ అణా పైసలతో లెక్క చెప్పడం వరకూ ఆడపనీ, మొగపనీ అనకుండా తండ్రికి కుడిచెయ్యి అయి నిల్చొంది ఇందిరమ్మ. డబ్బుగలవాడు కాబట్టి తండ్రినీ, తండ్రికి కుడిచెయ్యి కాబట్టి ఇందిరమ్మనీ ఇంట్లోవాళ్ళు అందరూ గౌరవించేవారు. చిన్నపని కయినా పెద్దపని కయినా 'పెద్దమ్మాయిగారే' కావలసివచ్చేవారు. చిన్నవాళ్లకే కాక తనకంటె పెద్దవాళ్లకు కూడా ఆవిడ పెద్దమ్మాయిగారే. బాబుగారు ఎలాగా ఆస్తంతా ఆవిడపేరే రాసిఉంటారు – ఈ పాటికి రాశారేమో కూడా' అని పనిమనుషులతోపాటు ఇంట్లోవాళ్ళుకూడా అనుకునేవారు. 'ఆవిడకేం, మాలా కాపురాలు చెయ్యాలా, అత్తారిళ్ళకు వెళ్ళాలా? నోరెత్తని




అవ్వా – పళ్లున్నాయా?

పళ్లా? లేవు నాయనా.

మొగుడూ – నెత్తిమీద పెట్టుకునే తండ్రీ – అదృష్టమంటే అలా ఉండాలి' అని ఆవిడ చెల్లెళ్లు అసూయపడేవారు. 'మన పెత్తనం ఏముందీ, దాసిల్లా చేతులు కట్టుకు నిలబడ్డానికి తప్ప? ఇనప్పెట్టె తాళాలే కాదు, ఆఖరికి వంటగరిట అయినా చేతికివ్వదు! బాగుంది, అందరికీ అన్ని తెలివితేటలుండొద్దూ, ఆవిడకేం ఆడమహారాజు!' అని వదినగార్లు వినపడేలాగే అనేవారు. ఇందిరమ్మకు చెముడో లేక ఆవిడ మనోకర్ణం యిలాంటి వాటికి అతీతమో గాని ఆవిడ ముఖకవళిక అయినా మారేదికాదు. తన పని అయిదు నిముషాలు ఆపేదీకాదు.

అరవై ఏళ్ళు దాటినా రెండో పెళ్ళికి రెడీగా ఉన్నంత పిక్కలాఉన్న వెంకట్రామయ్యగారు ఒకనాడు ఒకప్రక్క పచ్చని పంటనూ, రెండవప్రక్క ఎఱ్ఱని పంట కాలువనూ, పైన నీలం ఆకాశంనూ చూస్తూ మురిసిపోతూ క్రిందనున్న నల్లని భూమిలో కలిసిపోయారు. భూమీ పుత్రా ఉన్నవాడేమో రెండోది కాటేస్తే మొదటిదానిలోకి తప్పుకొన్నాడు. ఒక చక్కని సాయంత్రపువేళ పొలం మెళ్ళివస్తూ నాగుపాము కాటెయ్యగా నడక శాశ్వతంగా చాలించాడు.

మంచితనంతోనో — మంకుతనంతోనో కఠిన శిక్షతోనో క్రమశిక్షణలో కుటుంబాన్ని ఎదురు చెప్పడానికి వీల్లేనంతగా శాసించే ధనికుడైన యింటిపెద్ద హఠాత్తుగా మాయమైతే — ఒక్కసారి వచ్చే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎన్ని మార్పులు తెస్తాయో అన్ని మార్పులకీ వెంకట్రామయ్యగారి కుటుంబం లోనైంది. బాధ్యతలోతప్ప ఆస్తి పంచుకోవడంలో ఎప్పుడూ తండ్రి తరువాత తండ్రి అంతటివాడు అనిపించుకునే పెద్దకొడుకు ముందుకి వచ్చాడు. అన్నదమ్ములు అన్నగారి అడుగుజాడల్లో నడిచారు. ఎక్కడెక్కడో కాపురాలు చేస్తున్న ఆడకూతుళ్ళ రైలుఖర్చులు దండుగెట్టుకుని వచ్చి ఒక్కసారి భోరుమని 'లక్షరూపాయిలకి తక్కువ ఆస్తిలేదు. ఆడకూతుళ్ళం, పసుపూ కుంకానికయినా ఓవంద రూపాయిలు నోచుకోలేకపోయాం...అంతా తనే పడేసుకుని ఏకచ్ఛత్రాధిపత్యం ఏలుదామని చూసింది... పెద్దక్కకే యింత దుర్బుద్ధి లేకపోతే మనకికూడా ఇంత అన్యాయం జరక్కపోను' అని బావురుమన్నారు. వచ్చిన బంధువులకంటె ఇంటికి పిలిపించబడిన ప్లీడర్లు, వాటా పంపిణీదార్లు,

సలహాదార్లతో యిల్లు కిటకిట లాడిపోయింది. చచ్చిపోయినవాని కర్మకంటె బతికున్నవారి ముందు కర్మలకి అన్నదమ్ములు ఖర్చు పెట్టింది ఎక్కువ.

ఇందిరమ్మ కొడుకులు తాతగారి మరణ వార్త విని ఒక్కసారి వచ్చి ఒక్క రోజు ఉండి వెళ్ళిపోయారు. అల్లుడికి శలవు దొరక్క కూతురు రావడం పడలేదు. రంగూ, రూపమూ వర్ణించడానికి వీల్లేనంతగా మారిపోయిన వదనంతో యిందిరమ్మ నాలుగైదు రోజులపాటు మంచినీళ్ళు ముట్టకుండా వంటింట్లో గోడకి జారబడి అలా కూచున్నది కూచున్నట్లే ఉండిపోయింది. ఇందిరమ్మ కాళ్ళమీద బోర్లా పడుకుని తల్లి మొహంలోకి రెప్పవాల్చకుండా అలా చూస్తూన్నది చూస్తున్నట్లే ఉండిపోయింది. పన్నెండేళ్ళ శ్యామల! ఆమె చిన్నప్పట్నుంచీ పెంచిన ఆఖరి తమ్ముడు పదిహేనేళ్ళవాడు మాత్రం అప్పుడప్పుడు వచ్చి 'లేచి కొంచెం మజ్జిగన్నమయినా తిను పెద్దక్కా' అనేవాడు. ఇందిరమ్మ లేవనూ లేదు, శ్యామల కదలనూ లేదు.


అలా వాళ్ళిద్దర్నీ కలిపి విధి నాలుగేళ్ళు మాత్రమే ఉంచగల్గింది. ఇంతింత వాళ్ళను పెంచి అంతంత వాళ్ళను చేసిన వాళ్ళ చేతే చివాట్లుతింటూ వాళ్ళ చేతి తిండే తింటూ ఇందిరమ్మ శ్యామలకోసమే బ్రతికింది, రాణీగా బ్రతికిన ఇంట్లోనే దాసీగా చాకిరీచేస్తూ—ఎవరుమటుకు వారు ఆస్తులు పంచుకునిపోగా తనవంతు వచ్చిన ఇంట్లో ఊళ్ళో మిగిలిన రెండో తమ్ముడు ఉండగా వాడి పంచ చేరి ఒక్కొక్క క్షణం లెక్కపెట్టుకుంటూ—ఇందిరమ్మ శ్యామలకోసమే బ్రతికింది. మెడనున్న నగలు ఒకటీ ఒకటీ తీసుకుని అమ్మి, వీలయినంత వరకు తమఖర్చు తాము పెట్టుకుంటూ—తనుతినకుండా కూతురికి పెడుతూ, కూతుర్ని ఒకరిచేతిలో పెట్టి కన్నుమూద్దామనుకుని అనుకుంటూ ఇందిరమ్మ శ్యామలకోసమే బ్రతికింది. కోడళ్ళు ఇద్దరూ తన్ని పదిరోజులపాటు ఉంచుకునే మంచి తనమైనా ప్రదర్శింపక పోగా....కట్టుకున్న మొగుడికి ఏవేళప్పుడయినా చీమకుట్టినంత బాధ్యత లేక పోగా...ఓపిక ఉన్నదానికి పదింతలు చాకిరీ చేస్తూ ఇందిరమ్మ శ్యామలకోసమే బ్రతికింది. ఎట్టి పరిస్థితులలోనైనా ఆమె నిగ్రహం సడలిందంటే ఎవరూ నమ్మరు. ఆమెను సృష్టించిన కర్తకే నిగ్రహం సడలింది. పదిరోజుల సాధారణ రోగంతో ఆమె కన్ను మూసింది. పదహారేళ్ళ శ్యామల కన్నతల్లిని పోగొట్టుకుని — అందరూ ఉండి ఎవరూ లేనిదయింది!

తల్లిని చూసి నేర్చుకుందో తెలీదు, ధరణి తల్లిదగ్గర తెల్సుకుందో తెలీదు, శ్యామల ఓనాటి కోనాడు ఓర్పును పెంచుకుంది. పొద్దుట అయిదింటికే లేచి అరగంటలో కాల కృత్యాలు తీర్చుకునేది. నీళ్ళ పొయ్యి వెలిగించి, కాఫీకుంపటిమీద నీళ్లు పడేసి, దాసీ మనిషికి అంట్లు పడేసి, పాలవాడి దగ్గర పాలు పోయించుకుని చిన్నత్తను లేపేది. ఆమె వండుతూంటే అన్నీ అందించేది. ఆమె వడ్డిస్తూంటే పిల్లలకు అన్నాలు తినిపించేది. ఎంగిళ్ళు తీసేదీ. అన్ని పనులూ చేసి నాలుగు మెతుకులు నోట్లో కుక్కుకుని స్కూలుకి పరిగెత్తేది. స్కూలు జరుగుతూండగా ఎన్నిసార్లు యింటినుండి 'వదినా, అమ్మ రమ్మంటోంది' అని కబుర్లు వచ్చినా విసుగన్నమాట పైకి తోచనియ్యక యింటికి వచ్చి పనిసాయం చేసేది. సాయంకాలం స్కూల్నించి వస్తూనే కాఫీలు కలిపేది. పిల్లలకు తలలు దువ్వి ముస్తాబు చేసేది.అప్పుడప్పుడు టిఫినుచేసిబుల్లిమామయ్యకూ,చిన్న మామయ్యకూ యిచ్చేది. రాత్రి వంటిల్లు కడిగి ముగ్గుపెట్టి యివతలికి వచ్చాక, ఏ పదకొండు గంటల రాత్రివేళో ఆమెకు కాస్త విశ్రాంతి దొరికేది. 'అయ్యో, నిన్నటి ఇంగ్లీషు పాఠం చదవనే లేదు...' అని పుస్తకం ముందు కూర్చునేది ఏ అయిదు నిమిషాలో..చూస్తూండగానే ఒళ్లు తూలిపోయేది...మరుక్షణం ఆమెను నిద్రాదేవత జోకొడుతూ ఉండేది.

'ఇంత చేదోడు వాదోడుగా ఉంది గనక నే శ్యామలని వాళ్ల చిన్నమావయ్య వెళ్ళగొట్టలేదు' అని ఇరుగూ పొరుగూ అనేమాట శ్యామలమాత్రం ఒప్పుకొనేదికాదు.

'పియ్యూసీ' చదవడానికి చిన్నమావయ్య ఎంతమాత్రం ఒప్పుకోలేదని తెలిసిననాడు మాత్రం శ్యామల మొట్టమొదటి సారిగా బాధపడింది. మొదటిసారిగా...చివరిసారి కూడా అదేనేమో...శ్యామల తండ్రిచేతుల్లో మొహం పెట్టుకుని ఏడ్చింది. అయితే సీతయ్య మానాభిమానాలకూ సుఖదుఃఖాలకూ అతీతుడు. కూతురు ఆ ఇంట్లో ఉండి చాకిరీ చెయ్యకపోతే తనకి వేళపట్టున యింతఅన్నం ముద్దకూడా కరువౌతుందని అత నెరుగును. అందుకే మొహంలో ఏ భావమూ కనబడనియ్యలేదు. శ్యామల తలెత్తి తండ్రిమొహం చూసింది...అంతే...వెనుదిరిగి వచ్చేసింది. జీవితంలో అతనిముందు యింకెప్పుడూ చెయ్యి జాచలేదు. ఇంటికి వచ్చి ఆ రాత్రంతా ఆలోచించి తనకి అప్పుడప్పుడు అయిదూ పదీ పంపే చిన్నన్నయ్యకు ఉత్తరం రాసింది. 'ఒరే చిన్నా – నాకు ఎస్సెస్సెల్సీలో అన్నీ కలిపి 475 మార్కులు వచ్చాయి.మా స్కూలుకి ఫస్టు...ఇంకా చదవాలని ఎంతయినా ఉంది. ఎన్నివిధాల బ్రతిమాలినా చిన్నత్తా చిన్నమావయ్యా నన్నింక చదివించలేమంటున్నారు. నాకుమాత్రం ఎలాగైనాసరే చదవాలనే ఉంది...ఏం చెయ్యమంటావ్, చెప్పు?'

వారంరోజులు తిరక్కుండా స్కూలు అడ్రసుకు రిప్లై వచ్చింది. 'ఒసేవ్ శ్యామా, నీకు మంచి టోటల్ వచ్చినందుకు మేమందరం చాలా సంతోషించాము. పెళ్ళికాని ఆడపిల్ల తల్లిదండ్రులకే భారం. ఇంకాచిన్న మవయ్యా వాళ్లూ మంచివాళ్లు కాబట్టే అమ్మ పోయి ఇన్నాళ్లయినా నీ బాధ్యత వహించారు. అయినా ఇంకా పైచదువులు చదివి నువ్వేం వెలగబెట్టాలి? ఇందరు ఉండగా నామీద ఏదో పెద్దబరువుపెట్టి, నానుంచి ఏదో చాలా ఆశించి నాకే ఉత్తరం రాయడం ఏం బాగులేదు. ఆఖరికి అన్నయ్యకూ అక్క




య్యకూకూడా రాసి ఉండవు. అప్పుడప్పుడు ఏదైనా పంపడమేగా నేను చేసిన నేరం ? నేనిలా రాశానని అనుకోకు. ఇలాంటివి ఒకళ్లను అడిగేవికావు. నువ్వుకూడా బొత్తిగా చిన్నపిల్లవు కాదుగా !'

ఉత్తరం చదవడంతోనే ఆమె ముఖమంతా కన్నీళ్లతో తడిసి పోయింది. అది దీనాలాపన కాదు. దిక్కులేదని మొరాకాదు. అభిమానంతో, అవమానంతో ఆమె ఒళ్లు ఉడికి పోయింది. కళ్లు ఎఱ్ఱబడిపోయాయి. ఆ మరుసటినెల తనపేర్న అయిదు రూపాయలు వచ్చినప్పుడు ఆమె తిరక్కొట్టింది.

అలా చేయగలిగినందుకు ఆమె గర్వించింది. తనమీద తనకు ఆ క్షణంలోనే నమ్మకం ఎక్కువైంది. 'నాకు ఆస్తిపాస్తులు వద్దు, అజరామరాలు వద్దు; నా కాళ్లమీద నన్ను నిలబెట్టు, నా అంతటిదాన్ని నన్ను చెయ్యి భగవంతుడా!' అని ఆ క్షణాన శ్యామల దండం పెట్టుకొని ఉంటుంది. అయితేనేం భగవంతుడు ఆమె ప్రార్థన అంగీకరించినట్టు కనబడదు – ఆమెను ఇంకా పరీక్షలకు గురి చేశాడు, శ్యామల ఓడిపోయింది' అంత వరకూ అన్నీ వింటున్న నేను దానికిమాత్రం ఊరుకోలేకపోయాను.

'లేదు, శ్యామల ఓడిపోలేదు. శ్యామల లాంటి సుస్థిరమతికి ఓటమి లేదు' అన్నాను అక్కడికి వచ్చి.

వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు. వాళ్ళిద్దరి మాటలు విన్నందుకు క్షమాపణచెప్పుకుంటూ శ్యామల విషయంలో నా యింట్రస్టు ఏమిటో చెప్పేను. వాళ్ళగురించికూడా అడిగాను. శ్యామల ప్రాణస్నేహితురాలు పద్మావతి ఇంత సేపూ మాట్లాడుతున్న ఆయన కూతురట.

'ఆ అమ్మాయి ఓడి పోయిందో లేదో తర్వాత చూద్దాం. ఆమె ఇంకా ఏవో కష్టాలకు గురి అయిందన్నారే, అ వేమిటి?'

వింటున్న ఆయన అడిగాడు. ఈయన చెప్పడం ప్రారంభించాడు మళ్ళీ. 'డబ్బున్న వాళ్ళకీ, అదృష్టం కలసివచ్చిన వాళ్ళకీ – నిబంధనలూ నీతులూ చెల్లుతాయేమో... నాలాంటి దిక్కులేనిదానికి అభిమానాలూ పంతాలూ ఉంటే ఎవరిమీద చూపించాలి గనుక!' అనేది శ్యామల ఒక్కొక్కప్పుడు, మా పద్మావతి దగ్గర కొచ్చి. కాస్త అప్పుడప్పుడు తొట్రుపడినా ఆమె మరుక్షణంలో సర్దుకోడం ఆమెలోని ఔన్నత్యాన్ని చాటి చెప్పేది.

'ఇలాంటి 'నెగిటివ్ థింకింగ్' అలవాటు చేసుకుంటే – అసూయా ద్వేషాలు పెరిగి నా ఆత్మనే కాల్చివేస్తాయేమో...నన్ను క్షమించు పద్మా...అనుకోడంలో ఉందిగాని అందరికీ ఉన్నవేమిటి, నాకు లేని వేమిటి గనుక!' అని నవ్వేది. ఆ నవ్వు చూడలేని వారూ, చూసినా అర్థం చేసుకోలేనివారూ అది ఏడవలేక నవ్విన నవ్వంటే అనుకో గాక–, అది నిండుకుండ నిశ్చలత అనీ నిండునది నిర్మలత అనీ గ్రహించలేక!

'స్కూలు మానేసిన తరువాత శ్యామల చిన్నత్త ఆమెకు తోటపనికూడా అప్పజెప్పింది. మొదట్లో కష్టంగా ఉన్నా – రంగుల్లోనూ, డిజైనులోనూ ఒకటితో ఒకటి పోటీపడుతున్న పువ్వుల్నీ సీతాకోకచిలుకల్నీ చూస్తూంటే ఆమె మనసు – మిరపమందార కాడమీదకూడా వాలగలిగినంత బంగారు పచ్చికంత తేలికగా ఐపోయేది. ఒకనాడు సాయంకాలం బాల్చీ ఎత్తి నీళ్లు పోస్తూ గుండెలో ఏదో భరించలేని నొప్పి వచ్చినట్లై 'అమ్మా' అని ఒక్క అరుపు అరచి ఆ బాల్చీ అక్కడవ త్తేసి కూలబడిపోయింది. ఎందుకు వచ్చిందో ఏదో మామూలునెప్పిలే పోనియ్యమని ఆ సంగతి ఆమె ఎవరితో చెప్పలేదు కూడానట. మరొకసారి మడతమంచం మెట్లమీంచి క్రిందికి తెస్తూంటే అంతకంటె ఎక్కువగానే వచ్చిందిట నొప్పి. ఈ సంగతి విని మా పద్మ దెబ్బలాడి, వాళ్ళ మరిది డాక్టరులే, చూపించింది.

'ఈ అమ్మాయి బాగా నీరసంగా ఉంది, బొత్తిగా ఎనీమిక్‌గా ఉంది. హార్ట్‌కూడా చాలా వీక్‌గా ఉంది. పెద్దపెద్ద బరువులెత్తడం మాట అటుంచి ఈమెచేత అలసట కలిగించే పనులుకూడా ఏమాత్రం చేయించకూడదు. పూర్తి విశ్రాంతి అవసరం' అన్నాడు ఆయన.

ఈ మాట వినగానే శ్యామల చిన్నత్త ఆ చివర్నించి యీ చివరదాకా మూతి తిప్పింది.

'ఏమిటీ, ఈ సుకుమారికి నీరసం ఒకటా? మేం ఏదో పెద్దచాకిరీ చేయించి అష్టకష్టాలూ పెట్టేస్తున్నట్టు మాకు తెలీకుండా డాక్టరుకి చూపించుకురావడం మరొకటా? పదిహేనేళ్ళయి కాపురం చేస్తున్నాను, నలుగురు పిల్లల్ని కన్నాను – నాకు లేని గుండెదడ వయస్సులో ఉన్న పిల్ల దీనికంటే ఎవరేనా నమ్మొద్దూ? వద్దు బాబూ వద్దు...ఈ మెడబట్టిన మేనరికం, ఆ బలవంతపు బ్రాహణార్థం మా కొద్దు – పిడుగులా తండ్రి ఉన్నాడు, పిడికుచ్చిళ్లా అక్కా, అన్నలూ ఉన్నారు. వాళ్ళందరికీ లేని బాధ్యత మా కెందుకు బాబూ? ఈ పోషణా వద్దు, ఈ దూషణా వద్దు, వద్దండీ అని మొదట్నుంచీ మొత్తుకుంటుంటే ఈయన నా మాట విన్నారూ?'

ఒక్కొక్క మాటా ఒక్కొక్క శూలంలా శ్యామలను బాధించింది. ఆమె నిర్మించుకున్న అన్ని కవచాలనూ దూసుకుని అతి సున్నితమైన భాగం శరీరంలో ఏమి ఉందో దానికే ఆ బాణాలు తగిలేయి. వాళ్ళ అక్కయ్యఊరికి టిక్కెట్టుకొని రైల్లో కూచోపెట్టి ఆమె చిన్నమామయ్య అన్నాడుట:

'శ్యామా, నిన్ను యిలా దిగబెట్టడం చాలా సిగ్గుగా ఉందే, కాని ఏంచెయ్యను? నా కుటుంబానికి నువ్వు చేసిన చాకిరీ ఎలా మరచిపోగలను? నీ ఒంట్లో కొద్దిగా గుండె నొప్పి తప్ప మరేదో రోగమని మాత్రం బెంగ పెట్టుకోకు తల్లీ...ఎందుకైనా ఉంటుంద ఇదిగో ఈ సొమ్ము ఉంచు' అని పాతిక రూపాయలు యివ్వబోయాడట.

'ఒద్దు మావయ్యా, నీ రుణం యిప్పటికే నేను తీర్చుకోలేనిది. అమ్మ పోయినతర్వాత నాలుగైదేళ్ళు నీ దగ్గర నన్ను ఉంచుకున్నావు. నీ అభిమానం మాత్రం ఎలా మరచిపోగలను? నువ్వు పంపిస్తున్నావని వెడుతున్నాగాని నాకు అక్కయ్య దగ్గరకి వెళ్ళాలని లేదు...నా కేదైనా...'

'...సంబంధమా? తప్పకుండా చూస్తానే శ్యామా...ఎవరివో ఒకరివి ఏడాదికి ఒకటో రెండో పెళ్ళిళ్ళు మన యింట్లో జరుగుతున్నాయి. ఆలస్యం చేసి యిప్పటికే నీ కన్యాయం చేశాను...'

'లేదు మావయ్యా.....నే నడిగింది అది కాదు... దాని కేం తొందర గాని నా కేదైనా చిన్న ఉద్యోగం చూసిపెట్టూ...'



మొదట్లో గట్టిప్రయత్నం చేస్తే అప్పటికి పెళ్ళే అయిపోనేమోగాని ఇరవై రెండేళ్ళ వయస్సు, పైగా గుండెనీరసపుపిల్ల అని పేరు. చూసి చూసి శ్యామల మెడలో తాళి కట్టడానికి ముందుకి వచ్చే దెవరు? అందులో తల్లి లేనిది, తండ్రి ఉన్నా ఉన్నాడన్నభావం లేనిది, అన్నిట్నీ మించి కట్నం కొనుకా యిచ్చుకోలేనిది — శ్యామల పెళ్లి అవడం అంత సుళువా? మన పుట్టుక కేవలం ఒక యాక్సిడెంట్ అనీ, అందచందాలు మనం కొనితెచ్చుకునేవి కావనీ - యింత ఒడ్డూ యింత పొడవూ యిక్కడంత సన్నమూ, అక్కడంతలావూ ఉండాలని అందరికీ ఉంటుందనీ - అలా లేకపోవడం అదో నేరం కాదనీ జ్ఞానం ఉన్నవాళ్ళు తక్కువ కనుక - సర్వసామాన్యంగా ఉండే శ్యామల లోని లోవెలుగుని వెతికేవారూ, చురుకుతనాన్ని చూరగొనేవారూ ఎవరూ లేక పోయారు. ఒక్క ఏడాదికంటె శ్యామల అక్కడగ్గిర ఎక్కువకాలం ఉండలేక పోయింది. సొంత చెల్లెలయినా బ్రతికున్నంతకాలమూ ఏఅక్కమాత్రం ఆశ్రయం యివ్వగలదు గనక? ఎవరి కాపరాలువాళ్ళు యీడ్చుకురావటానికే పట్నాలలోపడి మూడు చెరువులనీళ్లూ, తాగుతూంటే శ్యామల లాంటి మానుషంగలది ఎక్కడ ఎన్నాళ్ళని ఉండగలదు గనక?'

'అయితే ప్రస్తుతం ఆమె ఎక్కడ ఉంది?'

'ఇంకెక్కడ ఉంటుంది? పెద్దన్నయ్య దగ్గిరికి చివరకి చేరింది. పెద్దన్నయ్య పెద్ద కంట్రాక్టరు. ఆయన భార్య కారుమీద తప్ప భూమ్మీద కాలు పెట్టదు. పిల్లల్నయితే కని పారేసింది గాని వాళ్ళవూసు ఆమెకు పట్టదు. అయిదు నిముషాలు ఇంట్లో ఉంటే ఆవిడకు గిట్టదు. ఇంచుమించు ఓ ఆయాలా శ్యామల ఆ పంచన కాలక్షేపం చేస్తోంది...పిల్లలకి నీళ్లోస్తూ, బట్టలు కడుతూ, చదువులు చెబుతూ...ఎంత గుండె దిటవు ఉన్నదైతే మాత్రం మానవమాత్రురాలుగాని చెరిపించి చేయించారా ఏమిటి? ఏదో చావా బతక్కుండా రోజులు ఈడ్చుకొస్తున్నదే గాని అంతటి తెలివి మంతురాలూ, బుద్ధిమంతురాలూ జీవితంలో సాధించినది ఏమిటి చెప్పండి? ఏమండీ, యిప్పు దేమంటారు? శ్యామల ఓడి పోలేదా?'

నేను నిశ్చయంగా ధృడంగా తల ఆడించాను.

'మీరు చాలా మంది కంటె ఎక్కువగానే శ్యామలను తెలుసుకున్నారు...కాదనను... కాని చివర్లోనే పప్పులో కాలేశారు. ఎంచేతంటే శ్యామల లాంటి దానికి ఇప్పుడే కాదు, జన్మ జన్మాలకీ ఓటమిలేదు – ఆ అమ్మాయి మంచితనం మీద నమ్మకం ఉంది, మానవత్వం మీద గౌరవం ఉంది, జీవితం మీద అనురక్తి ఉంది, దైవం మీద విశ్వాసం

ఉంది...యివి ఉన్నవాళ్ళకి ఓటమి అన్నది ఉంటుం దని నేను నమ్మలేను...'

ఆ ముందురోజు రాత్రే నా కూ శ్యామలకూ జరిగిన సంభాషణ గురించి వాళ్ళకు చెప్పేను...ప్రయాణపు అలసటలో మా ఆవిడా పిల్లలూ ముసుగులు తన్ని గుఱ్ఱులు పెట్టిన తరువాత...నా కేం తోచక అలా పెరట్లో అరుగు మీద కొచ్చి కూచున్నాను....

'ఎవరూ...మీరా మేష్టారూ, ఎన్నాళ్ళకి కలుసుకున్నాం, బాగున్నారా?' ఇటు తిరిగి చూశాను. శ్యామల! వరసగా ఓ వంద ప్రశ్నలు వేసింది. అదే కంఠం......అదే స్వరం...అదే ఆప్యాయత...అందు కే శ్యామలలో మార్పొచ్చిందంటే నేను నమ్మను. ఒక్క పావుగంట పలకరింపులతోనే మా మధ్య నున్న పదేళ్ళ దూరమూ మాసి పోయింది.

'ఇంత రాత్రివేళ యిక్కడేం చేస్తున్నావ్ శ్యామలా ?'

ఆ అమ్మాయి ఫక్కున నవ్వింది.

'వెన్నల రాత్రి కంటె చీకటి రాత్రి అంటేనే నాకు ఎక్కువ ఇష్టం మేష్టారూ... చీకట్లో నక్షత్రాలను వెదకడం, లెక్క పెట్టడం చిన్నప్పట్నుంచీ నాకు యిష్టం... ఓ రాత్రివేళ వెల్లకిలా పడుకుని అమ్మ అలాగే చూ సేది...అమ్మ పక్కని పడుకుని నేనూ అలాగే చూసేదాన్ని...అంతే కాదు పేడతో నల్లగా అలికిన నేల మీద అమ్మ తెల్లని చుక్కల ముగ్గు పెట్టేది...అమ్మ వీపుమీద ఎక్కి తల పక్క నుంచి నేనూ ఆ చుక్కల్ని చూసేదాన్ని...ఆ చుక్కలన్నా ఈ చుక్కలన్నా నాకు చాలా యిష్టం'...

'అవును, అందుకే నల్లని నీ బుగ్గల మీద భగవంతు డెప్పుడూ తెల్లని కన్నీటి చుక్కలు రాసి పెట్టేడు'అను కున్నాను.'కాదు'అన్నాను నెమ్మదిగా...

'కావచ్చు, కాని ఇవి వెల వెల బోయే చుక్కలు మాత్రం కాదు, మిల మిల మెరిసే చుక్కలు, కాదంటారా?'

'నన్ను మభ్య పెట్టి నిన్నింకా నువ్వెందుకు మోస పుచ్చుకుంటావ్ శ్యామలా ? నిజంగా నీ జీవితంలో సుఖం అన్న పదానికి అర్థం ఉందా? ఒక్క మారేనా ఫక్కున నవ్వు కోగల క్షణం ఇంతవరకు నీకు లభించిందా? పినతల్లులూ మేనమామల మాట అటుంచు, పోనీ నీ అక్కయ్యా అన్నయ్యల మాట వదిలెయ్యి, కన్న తల్లీ దండ్రీ నీకు చేసిన అన్యాయం యింతా అంతానా?.'

'లేదు, మేష్టారూ, లేదు. మీరు పొర బడ్డారు...అమ్మా నాన్నా నాకు ఏమీ అన్యా యం చెయ్యలేదు .అందరి లాగే నన్ను పెంచి ఒక అయ్య చేతిలో పెడితే చాలామంది లాగే నేనూ నిరర్థక రాల్ని అయి పోయే దాన్ని. దయామయుడైన భగవంతుడు నాకు మరో విధంగా చాలా సహాయం చేశాడు. కష్టాలలో కలకల నవ్వే కఠినత్వం ప్రసాదించాడు. ఇక ఏం జరిగినా ఫరవాలే దనే నిశ్చింతను అను గ్ర హిం చా డు. ఏ పదిహేనో ఏటో పెళ్ళి జరిగితే-జీవితం అనేది ఏమిటో తెలియనప్పుడు అందులో అడుగు పెట్టి ఎందునా పొందకుండా నశించే దాన్ని...కష్టాలు భరించ గలిగిన యిప్పుడు నాకు సుఖాలు అనుభవించడం కూడా తెలుసు. పెళ్ళంటే ఏమిటో తెలుసు...'

'కాని......యిన్నీ తెలుసుకునే దాకా వయసు ఆగదుగా శ్యామలా? నీకీ వయసులో, గట్టిగా ప్రయత్నించే మీవాళ్ళు లేనప్పుడు పెళ్ళయే అవకాశము ఆట్టే లేదుగా?'

'ఎందుకు లేదు మాష్టారూ...ఉంది... లోకంలో ఉన్నవాళ్ళందరూ స్వార్థపరులూ, త్రాగుబోతులూ, వ్యభిచారులూ అంటే నేను నమ్మలేను. మంచితనం గుర్తించే మంచి వాళ్ళు లేక పోలేదు...నే నిలా కన్యగా మోడువారిపోతా ననే చింత నాకు కలలో కూడా లేదు...నా కోసం వెదుక్కుంటూ నాకు తగిన వాడు ఏదో ఒకరోజు రాక పోడు...మెత్తదనం గట్టిదనం కలగలసిన పిల్లల్ని నేనూ కనక పోను...మంచి తనం, సహనగుణం నా పిల్లలూ నేర్చుకోకపోరు.'

శ్యామల సిగ్గు పడి ఆగి ఒక్కమారు తలెత్తి నక్షత్రాలను చూస్తూ అంది.

'ఏడాదికి ఒక్కసారి దీపావళి అంటారు, ఎందుకనో మరి...తలెత్తి చూడ గలిగితే ఏ చీకటిరాత్రి మాత్రం దీపావళి కాదు?'

ఆమెకు నే నేమని జవాబు చెప్పగలను? కాని నాకంటె కొంచెం తక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళిద్దరితో మాత్రం కొంచెం పెద్ద గొంతుకతోనే మాట్లాడేను.

'ఇప్పుడు చెప్పండి, శ్యామల ఓడి పోయిందంటారా? 'అమ్మా ఇప్పట్లో నా కీ కన్నె చెర విడిపించవా?' అని తల్లి ఫోటోతో మొర పెట్టుకున్న దంటారా? మొదటి బెంచీలో ముందు సీటులో కూచునే శ్యామల... కొద్ది వయసులోనే వివిధ రకాల కష్టాలకు లోనై కాకలు తీరి...పదును బడి...జీవిత స్వారస్యం గ్రహించడంలో ప్రప్రథమ తాంబూలం అందుకోలే దంటారా?'

వాళ్ళు మాత్రం నాకేం జవాబు చెప్ప గలరు? ఏ మాత్రం తొట్రు పడకుండా ఆ నాటి రాత్రి శ్యామల అంతటి ఆత్మవిశ్వా సంతో నాకు చెప్పుకున్న సత్యం ప్రత్యక్షం కావడమే నాలాంటి సామాన్యుల ఆశ్చర్యానికి కారణం. ఆ 'ఎవడో వాడు' రెండేళ్ళు తిర క్కుండా రానే వచ్చాడు. వాళ్ళ పెద్దన్నయ్య స్నేహితుడి బావమరిదిట. బొంబాయిలో ఉద్యోగంట. ఫోను మీద మాటలు జరిగాయి. తుఫానులా పనులు జరిగి పోయాయి. ప్లేను మీద దిగి యింత పొడు గున అంత వెడల్పున మా శ్యామలమ్మను చంకనెత్తుకు పోడానికి చక చకా పెళ్ళి పందిట్లోకే నడిచి చక్కా వచ్చాడు!

ఈ సారి, ఈ పెళ్ళికి, బ్యాండు మేళాలూ, మైకులో మంత్రాలూ, సినిమా రికార్డులూ ఏవీ నన్ను విసిగించలేదు! రోజుకి మూడు సార్లు గెడ్డం గీసుకుని, నాలుగు సార్లు తల దువ్వుకొని, అయిదు సార్లు పౌడరు రాసు కుంటే మా ఆవిడ ఆశ్చర్యాని కంతు లేక పోయింది! నేను పెళ్ళికూతురికి యిచ్చిన బహూమతి ఏమిటో చెప్పమంటారా? తెల్లని చుక్కచుక్కల నల్లని కాశ్మీరు సిల్కుచీర! ★